క్లుప్తంగా

పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయకు నివాళి

శ్రీకాళహస్తి: పట్టణంలోని పాతబస్టాండ్ కూడలి వద్ద శనివారం భారతీయ జనసంఘ వ్యవస్థాపకుల్లో ఒకరైన పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోలా ఆనంద్, కంఢ్రిగ ఉమ, గరిక పాటి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 95 కేసుల పరిష్కారం



కేసులు పరిష్కరిస్తున్న జడ్జి పవన్ కుమార్

సత్యవేడు: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 95 కేసులు పరిష్కరించారు. పలు కేసులకు సంబంధించి రూ. 11,72,088 రికవరీ చేశారు. తిరుపతి 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ పవన్ కుమార్ కేసులను పరిష్కరించారు. సివిల్ కేసులు 2, క్రిమినల్ కేసులు11, చెక్‌బౌన్స్ కేసు 1, బ్యాంకు కేసులు 4, బీఎస్ఎన్ కేసులు 3, సెకండ్‌క్లాస్ కోర్టు కేసులు74 పరిష్కారం అయ్యాయి. కక్షిదారులు కేసులను సత్వరమే పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌ను వేదికగా మార్చుకోవాలని జడ్జి పవన్‌కుమార్ సూచించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఏర్పేడు: మండలంలోని కొత్తవీరాపురం వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు శనివారం రాత్రి కొత్తవీరాపురం సమీపంలోని స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

సోషల్ మీడియా కార్యవర్గం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా కొన్నలి గ్రామానికి చెందిన కేతినేని వెంగళరావుని నియమించారు. అలాగే ఆయనతోపాటు మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన షేక్.సురాజ్, పెన్నలపాడు గ్రామానికి చెందిన మేరిమ్ దేవకుమార్, లింగమనాయుడుపల్లెకు చెందిన ఎస్.రవి కోకన్వీనర్లుగా నియమితులయ్యారు.

ఏర్పేడు మండల నూతన కార్యవర్గం

ఏర్పేడు: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా మండలంలోని వికృతమాల గ్రామానికి చెందిన కేశవులు రెడ్డి నియమితులయ్యారు. కో-కన్వీనర్లుగా మండలంలోని మోదుగులపాళెం గ్రామానికి చెందిన శ్రీహరి, కొత్తవీరాపురం గ్రామానికి చెందిన గాండ్ల లోకేష్ నియమితులైనట్లు వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి.

28 వరకు 30 పోలీసు యాక్ట్

నారాయణవనం: మండలంలో సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలంటే పోలీసు శాఖ నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ ఈనెల ఒకటో తేదీ మండలంలో 30 పోలీసు యాక్ట్ అమలులో ఉందని, ఈనెల 28వ తేదీ అమలులో ఉంటుందని తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా సౌండ్ సిస్టం, మైక్‌లు వాడకూడదని తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాల

తిరుమల: శ్రీవారిని శనివారం మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాల, తెలంగాణ ఎమ్మెల్సీలు బసవరాజు సారయ్య, రఘోత్తంరెడ్డి, ఏపీ ఎమ్మెల్సీలు కల్పలతా రెడ్డి, దువ్వాడ శ్రీనివాసులు, మాజీ డీజీపీ ఆర్పీ ఠాకూర్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

దేవతలారా రండి.. దీవెనలందించండి!

- ధ్వజారోహణంతో ప్రారంభమైన పల్లికొండేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం, సురుటపల్లెలోని శ్రీశ్రీమంగళాదేవి సమేత పల్లికొండేశ్వర స్వామి ఆలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారం ఉదయం ధ్వజారోహణంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు వైభవోపేతంగా ధ్వజారోహణం నిర్వహించారు. ఆలయ అర్చకుల వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ పూర్ణాహుతి చేపట్టి ధ్వజారోహణ చిత్రపటాన్ని ధ్వజస్తంభం పై అధిష్ఠింపజేసి ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలికారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మహాదీపారాధన, ఐదు గంటలకు యాగశాల పూజ, సాయంత్రం మూలవర్లను అభిషేకించిన అనంతరం పార్వతీ, పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను పల్లకీపై అధిష్ఠింజేసి చూడముచ్చటగా అలంకరించారు. అనంతరం స్వామి,అమ్మవార్లు పల్లకీలో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. మొదటి రోజు ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్సీ కందేరి జయచంద్రనాయుడు, అతని కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరింపజేశాయి. ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి, ఈఓ రామచంద్రారెడ్డి, బోర్డు సభ్యులు ఎస్ఎం సురేష్, అజయ్‌కుమార్, కవిత, మంజుల, ఆనందుడు, చిత్ర, సత్య, మునివేలు, ప్రత్యేక ఆహ్వానితులు రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహ సారథులే రథసారథులు



సచివాలయ కన్వీనర్లకు కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిములం

నారయణవనం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, ప్రజలకు మధ్య సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు వారధులుగా పనిచేయాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. శనివారం కమ్యూనిటీ భవనంలో సచి వాలయ కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల ఇంటి ముంగిటకే అందిస్తున్న సంక్షేమాన్ని, నిలుపుకున్న హామీలను గడప గడపకు వెళ్లి వివరించాలని అన్నారు. పార్టీ అందజేసిన 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను ఇంటి యజమాని అనుమతితో తలుపుపై అతికించాలని అన్నారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్, క్యాలెండర్‌ను అందజేస్తూ కుటుంబ సభ్యుల అభిప్రాయాలను సేకరించాలని సూచించారు. పార్టీ ప్రజాప్రతినిధులు పర్యవేక్షించి, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని పూర్తి చేయించాలని అన్నారు. ప్రతి గడపకు వెళ్లినప్పుడు నేడు జగనన్న-నాడు చంద్రబాబు ప్రభుత్వ విధానాలను వివరించాలని తెలిపారు. ఏవైనా అనుమానాలు ఉంటే తీర్చాలని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ఈనెల 20వ తేదీన ప్రారభించి 28వ తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. మండల సచివాలయాల కన్వీనర్ కోనేటి బాబు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తమపై పెట్టిన బాధ్యతను చిత్తశుద్ధితో పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, వైఎస్ ఎంపీపీ శివశంకర్, బీసీ సెల్ మండల కన్వీనర్ శివకుమార్, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

నేడు శివానంద ధామం ప్రారంభం





శివానంద ధామం

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం స్వర్ణముఖి నదీ తీరాన 'శివానంద ధామం' పేరుతో నూతనంగా నిర్మించిన అధునాతన వసతులతో కూడిన శ్మశాన వాటికను ఆదివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. గ్రామంలోని శ్మశాన వాటిక అస్తవ్యస్తంగా ఉండడంతో అమెరికాలో స్థిరపడిన గాజులమండ్యం వాసి జువ్వల మోహన్‌రామిరెడ్డి, జయలక్ష్మి దంపతులు తమ జన్మభూమికి ఏదో ఒకటి చేయాలని భావించి శ్మశాన వాటికను అధునాతన సౌకర్యాలతో తీర్చిదిద్దాలని నిర్ణయించారు. రూ.1.50 కోట్లు వ్యయంతో శ్మశాన వాటికను సుందరంగా తీర్చిదిద్దారు. వారు అమెరికాలో ఉండడంతో గ్రామానికి చెందిన జువ్వల ధనంజయరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, ధరణీశ్వర్‌రెడ్డి, లీలామోహన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, జువ్వల కుటుంబ సభ్యులంతా కలసి శ్మశాన వాటికను చూడముచ్చటగా తీర్చిదిద్దారు. శ్మశాన వాటికలో ముక్తిభావం కలిగించే వేమన పద్యాలు, పలు సూక్తులు, 15 అడుగుల పరమ శివుని విగ్రహం, గోడలపై శివుని చిత్రాలతో రూపొందించారు. శివానందదామం నిర్మాత జువ్వల మోహన్‌రామిరెడ్డి శనివారం శ్మశాన వాటికకు చేరుకుని కూలీలకు నూతన వస్త్రాలను అందజేశారు.

మంత్రి రోజా పరామర్శ

నారాయణవనం: నాయుడుపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని గోవిందప్పనాయుడుకండ్రిగ దళితవాడకు చెందిన ధర్మరాజు కుటుంబ సభ్యులను మంత్రి రోజా శనివారం మధ్యాహ్నం పరామర్శించారు. గత ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందిన విషయం విదితమే. మృతుల్లో ధర్మరాజు ఒకడు. ఇతను కూలి పనులతో జీవించేవాడు. భార్య, 5 నెలల కుమార్తె ఉన్నారు. మృతుని ఇంటికి వెళ్లిన మంత్రి రోజా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని పేర్కొన్నారు. మంత్రి వెంట నిండ్ర మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్, నాయకులు నందకుమార్, మోతీలాల్, మురళి, గిరి, రాము, కన్నయ్య తదితరులు ఉన్నారు.

వేడుకగా 80వ మహా కూడికలు



మహా కూడికల ఉత్సవంలో మహిళలు

రేణిగుంట: స్థానిక జ్యోతినగర్‌లోని దక్షిణ ఆంధ్ర లూథరన్ చర్చిలో శనివారం 80వ మహా మహిళల కూడికలు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. తిరుపతి, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చర్చి నిర్వాహకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మూడు రోజులు పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ పాల్గొని ప్రార్థనలు చేశారు. సంఘ కాపరి టెన్సింగ్ విక్టర్, పీసీసీ చైర్మన్ మధుదేవానందం, వైస్ చైర్మన్ ప్రసాద్, కార్యదర్శి ఆల్ఫ్రెడ్ ప్రేమ్‌చంద్, బిషప్ రెవరెండ్ విజయకుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సహకరించండి



సత్యవేడు: మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్రమణ్యం

సత్యవేడు: గ్రాడ్యుయేట్, ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని తహసీల్దార్ టీవీ. సుబ్రమణ్యం కోరారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీ నాయకులకు పోలింగ్ బూత్‌ల నిర్వహణపై అవగాహన కార్యక్రమం జరిగింది. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పార్టీల నాయకులు సహకారం అందించాలన్నారు. సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాల వద్ద రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు విడుదల చేసిన జాబితాలో గ్రాడ్యుయేట్ ఓటర్లు 1,394 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 47 మంది ఉన్నారని తెలిపారు. ఈనెల 13 వరకు ఓటరు నమోదుకు అవకాశం ఉందన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చే దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. పోలింగ్ మార్చి 13న ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటలకు వరకు జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుశీల్ కుమార్ రెడ్డి, బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఎస్.మునికృష్ణయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ఎం.శివయ్యశెట్టి, సీపీఎం నాయకులు రమేష్, అరుణాచలం, బీజేపీ నాయకులు బండారు మోహన్ బాబు, వెంకటేశ్వర్లు, ఎన్నికల డీటీ బి. రవిచంద్రబాబు, ఆర్ఐ రమాకాంత్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమాళిని పాటించండి

బుచ్చినాయుడుకండ్రిగ: ఎమ్మెల్సీ ఎన్నికల నియమాళిని ప్రతి ఒక్కరూ పాటించాలని మండల ఎన్నికల అధికారి, డిప్యూటీ తహసీల్దార్ శివయ్య తెలిపారు. శనివారం తహసీల్దారు కార్యాలయంలో అధికార, ప్రతిపక్ష, వామపక్ష నాయకులకు ఎన్నికల కోడ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 16వ తేదీ వరకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ భవనాలపై పోస్టర్లను అంటించకూడదని, చర్చిలు, దేవాలయాలు, మసీదుల వద్ద బహిరంగసభలు నిర్వహించకూడదని తెలిపారు. అధికారుల అనుమతితోనే సభలు, సమావేశాలు నిర్వహించాలన్నారు. ఫ్లెక్సీలను పార్టీల నాయకులు తొలగించాలని, లేకుంటే అధికారులే తొలగిస్తారన్నారు. ఎన్నికల నియమాళిని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ మంజునాథరెడ్డి పాల్గొన్నారు.

కొత్తవీరాపురంలో ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రసాద్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని కొత్తవీరాపురంలో శనివారం ఏర్పేడు పీహెచ్‌సీ డాక్టర్ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ పరిధిలోని కొత్తవీరాపురం, ఎస్సీ కాలనీ, అరుంధతీయవాడ నుంచి వచ్చిన 85 మంది రోగులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మధ్యాహ్నం పైగా దీర్ఘకాలిక వ్యాధులతో మంచం పట్టిన రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఏలు కామాక్షి, శేఖర్‌రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ కృష్ణవేణి, ఎంపీహెచ్ఎస్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

బుచ్చినాయుడుకండ్రిగ: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డులో వివిధ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను శనివారం వీఆర్ఓ ప్రసాద్ కూలీలచే తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ నుంచే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. కోడ్ అమల్లో ఉండడంతో పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు ఉండకూడదని తెలిపారు. నాయకులు తొలగించకపోవడంతో తామే చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా శిక్ష తప్పదు



ముచ్చువోలు దళిత కాలనీలో ర్యాలీ చేస్తున్న మహిళలు

శ్రీకాళహస్తి రూరల్: బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా శిక్షలు తప్పవని ప్రజా ప్రగతి ట్రస్టు శ్రీకాళహస్తి డివిజన్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ హెచ్చరించారు. శనివారం శ్రీకాళహస్తి మండలంలోని ముచ్చువోలు, దొడ్లమిట్ట, మంగళపురి, ముద్దుమూడి, ఎర్రగుడిపాడు గ్రామాల్లో ప్రజాప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకోవాల్సిన వయస్సులో కొంత మంది విద్యార్థినుల తల్లిదండ్రులు బాల్యవివాహాలు చేస్తున్నారన్నారు. బాల్యవివాహాలకు స్వస్తి పలికి, ప్రతి ఒక్కరూ తమ బిడ్డలను ఉన్నత చదువులు చదివించాలని పిలుపునిచ్చారు. నిరుపేదలు ఉన్నత చదువులు అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకువచ్చి పలు పథకాలు అమలు చేసిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాని కోరారు. 18 ఏళ్లు నిండిన తర్వాత బాలికలకు, 21 సంవత్సరాలు నిండిన తర్వాత బాలురకు వివాహం చేయాలన్నారు. బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమని అన్నారు. మీ పరిసర ప్రాంతాల్లో బాల్యవివాహాలు జరుగుతుంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. బాలికలను ఎవరైనా వేధిస్తే చైల్డ్‌లైన్ 1098, పోలీస్ హెల్ప్‌లైన్ 100కు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ముచ్చువోలు సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శి అనూష పాల్గొన్నారు.

బాల్యవివాహాలను నిర్మూలిద్దాం

ఏర్పేడు: బాల్యవివాహాలను నిర్మూలిద్దామని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పావనశ్రీ అన్నారు. శనివారం మండలంలోని జంగాలపల్లెలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యానేరమన్నారు. చిన్నతనంలో వివాహాలు చేస్తే మానసిక రుగ్మతలకు గురవుతారన్నారు. గ్రామాల్లో అలాంటి వివాహాలు జరిగితే 1098, 100 ఫోన్ ద్వారా సమాచారం అందించాలని చెప్పారు. శ్రీకాళహస్తిలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు బాల్యవివాహాలు జరుగకుండా నియంత్రించాలన్నారు. సర్పంచ్ నారాయణ, అంగన్‌వాడీ కార్యకర్త భూలక్ష్మి, ఏఎన్ఎం శ్రీదేవి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మాతా శిశుమరణాలపై అవగాహన

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని శివనాథపాళెంలో శనివారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్ వైజర్ కామరాజు ఆధ్వర్యంలో వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు వైద్య ఆరోగ్యశాఖ వారు అందజేస్తున్న మాతాశిశు సంరక్షణ పుస్తకం చాలా విలువైనదని, అందులో సూచించిన విషయాలను చదివి అర్థం చేసుకుని, ప్రతి గర్భిణి వ్యవహరిస్తే మాతాశిశు మరణాలు జరగవని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రాధమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ భాగ్యశ్రీ, ఆశా కార్యకర్తలు రాజాత్తి, చెంగాలమ్మ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

గృహ సారథులే కీలకం

వరదయ్యపాళెం: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు చేరవేస్తూ రాబోయే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చేందుకు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ చిన్నా తెలిపారు. శనివారం మండల కేంద్రంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు 'మా నమ్మకం నీవే జగన్' కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వంపై ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాలను, బురదజల్లే కార్యక్రమాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడే ప్రతిఒక్కరికీ గుర్తింపు, న్యాయం జరుగుతుందని, సమన్వయంతో ×మా నమ్మకం నీవే జగన్ట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ సర్పంచ్ తిలక్‌బాబు, మండల యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, నాయకులు మహేంద్ర, గిరిరెడ్డి, పృథ్వీ రవి, శివా యాదవ్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

రాజీనే రాజమార్గం



కక్షిదారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి బేబీరాణి

శ్రీకాళహస్తి: రాజీ మార్గమే రాజమార్గమని శ్రీకాళహస్తి న్యాయస్థానం సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి అన్నారు. పట్టణంలోని కోర్టు భవనంలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. మొదట కోర్టు ఆవరణలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం జరిగిన లోక్‌అదాలత్‌లో న్యాయమూర్తి బేబీ రాణి మాట్లాడుతూ జాతీయలోక్ అదాలత్ ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించుకోవాలన్నారు. రాజీ మార్గమే రాజమార్గంగా కేసులను పరిష్కరించుకోవాలన్నారు. రాజమార్గంలో కక్షిదారులతో ప్రత్యక్ష పద్ధతిలో కేసుల పరిష్కరించడం బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. లోక్‌అదాలత్‌లో ఇరువర్గాల వారు విజేతలేనన్నారు. అనంతరం లోక్ అదాలత్ ప్రారంభించారు. మొత్తం 513 కేసుల ద్వారా రూ.1,09,33,585 సొమ్ము రికవరీ అయింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి నరేంద్రరెడ్డి, న్యాయవాదులు, అన్ని శాఖల అధికారులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ముక్కంటి బ్రహ్మోత్సవాలకు పలువురికి ఆహ్వానం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13వ తేదీ నుంచి 26వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, ఎండోమెంట్ కమిషనర్ హరి జవహర్‌లాల్‌ను పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు విజయవాడలో శనివారం కలిసి, ఆహ్వానించారు. అనంతరం విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ఈఓ భ్రమరాంబను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు జయశ్యామ్, ఆలయ పురోహితులు ప్రసాద్ శర్మ, వైఎస్సార్ సీపీ నాయకులు నరసింహులు, కంఠా ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచుకోవాలి



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో మిద్దెల హరి

శ్రీకాళహస్తి రూరల్: మారుతున్న పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవాలని వైస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు, స్కిమ్స్ విద్యాసంస్థల అధినేత మిద్దెల హరి సూచించారు. శ్రీకాళహస్తి మండలంలోని కాపుగున్నేరి సమీపంలో ఉన్న స్కిమ్స్ ఎంసీఏ, ఎంబీఏ కళాశాలలో శని వారం ఇన్వెస్టర్ అవేర్నెస్ ప్రోగ్రాంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆయన మాట్లాడుతూ లక్ష్యాలను ఏర్పరచుకుని చదివితేనే ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలకు చేరుకోగలరన్నారు. ప్రస్తుతం పోటీతత్వాన్ని తట్టుకుని రాణించాలంటే ఎంతో కష్టం అన్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా తెలుసుకుంటేనే రాణించగలమన్నారు. ఆధునిక పరిజ్ఞానం, టిక్నాలజీ మీద అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం స్టాక్ మార్కెట్ ట్రైనర్, ఎస్ఐఎస్ఎం అప్రూవల్ ట్రైనర్ డాక్టర్ నాగార్జున ఇన్వెస్టర్ అవేర్నెస్ ప్రోగ్రాంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఇన్వెస్టిమెంట్, ఫైనాన్షియల్ ఇన్వెస్ట్‌మెంట్, ప్రైమరీ మార్కెట్, సెకండరీ మార్కెట్, మ్యూచ్యువల్ ఫండ్స్, ఇన్వెస్టింగ్ ఇన్ సెక్యూరిటీస్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ట్రైనర్ నాగార్జున్‌ని కళాశాల అధినేత మిద్దెల హరి సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

ముక్కంటి సేవలో సినీ నటి మంచులక్ష్మి





ఆలయంలో సినీ నటి మంచులక్ష్మి, ఎమ్మెల్సీ కల్పలత

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ప్రముఖ సినీ నటి మంచు లక్ష్మి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు ఆమెకు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆమెకు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోలా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటిని దర్శించుకున్న ఎమ్మెల్సీ కల్పలత

జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం కృష్ణాజిల్లా ఎమ్మెల్సీ కల్పలత దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు ఆమెకు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.